ట్రాక్టర్ కిస్తీలు తడిసిమోపెడు

- పంచాయతీలపై అదనపు భారం
- పెరిగిన డీజిల్ ఖర్చులు, జీతాలు
- బేజారవుతున్న సర్పంచులు
- పట్టించుకోని ప్రభుత్వం
- 7 నెలలుగా రాని ఎస్ఎఫ్‌సీ నిధులు
- పెండింగ్ కిస్తులు చెల్లించిన కలెక్టర్


గ్రామాల్లో చెత్త సేకరించేందుకు ఉపయోగిస్తున్న పంచాయతీ ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట: గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారుతోంది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం తడి, పొడి చెత్త సేకరణకు ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించారు. చెత్త సేకరణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాక పంచాయతీలకు వచ్చే ఆదాయంతోనే వెల్లదీస్తున్నారు. చెత్త సేకరణ, మొక్కలకు నీరు పట్టడం తదితర పనుల కోసం గ్రామపంచాయతీలే కిస్తుల పద్ధతిలో బ్యాంకుల ద్వారా రుణం తీసుకుని ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. ఓవైపు నెలనెలా ఆ కిస్తీలు చెల్లించడం, మరోవైపు పారిశుధ్య సిబ్బందికి జీతాలు, డీజిల్ ఖర్చులతో సర్పంచులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 17 మైనర్ గ్రామపంచాయతీలే. ముఖ్యంగా చిన్న గ్రామపంచాయతీలలో చెత్త సేకరణ, మొక్కలకు నీరు పట్టడం, ఇతర పనులు చేపట్టడం ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా చెత్త సేకరణ కోసం రుణ పద్ధతిలో తీసుకున్న ట్రాక్టర్లకు ప్రభుత్వమే కిస్తీలు చెల్లించాలని సర్పంచులు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. జీపీలకు వచ్చే నిధుల నుంచి కలెక్టర్ ప్రస్తుతం పెండింగ్ కిస్తులను చెల్లించారు. అయితే డిజిల్, నిర్వహణ, వేతనాలకు సంబంధించి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. వచ్చే నెల నుంచి తిరిగి పంచాయతీలే క్రమం తప్పకుండా కిస్తులు చెల్లించాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

నెలకు రూ.50 వేల ఖర్చు

గ్రామాలను స్వచ్ఛతలో ముందుంచేందుకు సర్పంచులు పడరాని పాట్లు పడుతున్నారు. కేవలం గ్రామంలో చెత్త సేకరణ, మొక్కలకు నీరు పట్టేందుకు నెలకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. చెత్త సేకరణకు ఒక ట్రాక్టర్ వెంబడి ముగ్గురు పారిశుధ్య సిబ్బందితో పాటు ఒక డ్రైవర్‌కు కలిపి నెలకు రూ.20 వేలు, ట్రాక్టర్ కిస్తీ నెలకు రూ.10 వేలు, డీజిల్ ఖర్చు రూ.20 వేల చొప్పున మేజర్ గ్రామపంచాయతీలకు సుమారుగా రూ.50 వేలు, చిన్న గ్రామపంచాయతీలకు నెలకు రూ.30 వేల చొప్పున పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు ఏడు నెలలుగా రావడం లేదని సర్పంచులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీకి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తప్ప ప్రభుత్వ నుంచి ఎలాంటి నిధులు మంజూరు కావడం లేదు. గ్రామంలో వీధిలైట్లతో పాటు, నీటి నిర్వహణ, నర్సరీ, శ్మశానవాటికల నిర్వహణ భారం కూడా గ్రామపంచాయతీలపైనే పడుతోంది. ప్రధానంగా విద్యుత్ బిల్లులు చెల్లించలేక సర్పంచులు ఇబ్బంది పడుతున్నారు.

రాబడి తక్కువ వాటికే నిధులు

పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులకు ఏడాదికి రూ.5 లక్షల రాబడి కంటే తక్కువగా ఉన్న జీపీలకు మాత్రమే ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం చివరిలో అనగా మార్చిలో నిధులు మంజూరు చేస్తోంది. ఏడాదంతా సర్పంచులే తమ జేబుల నుంచి డబ్బులు ఖర్చు చేస్తే తప్ప ఏ పని జరిగే పరిస్థితి లేదు. సర్దుబాటులో కూడా అనేక సాంకేతిక కారణాలతో కొన్ని జీపీలకు నిధులు రాక సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. అభివృద్ధి పనులు, చెత్త సేకరణ, మొక్కలు, నర్సరీ, శ్మశాన వాటికల నిర్వహణ కోసం ప్రత్యేక నిధులను కేటాయించాలని సర్పంచులు కోరుతున్నారు.

భారమవుతోంది



గ్రామంలో చెత్త సేకరణకు నెలకు రూ.30 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నిర్వహణ భారం పడుతోంది. చెత్త సేకరణ, శ్మశానవాటిక, నర్సరీల నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రభుత్వం చిన్న గ్రామపంచాయతీలకే సర్దుబాటు నిధులను కేటాయిస్తోంది. అప్పులు చేసి గ్రామ అభివృద్ధి పనులు చేయాల్సిన పరిస్థితి ఉంది.

– నిమ్మ లక్ష్మి, సర్పంచ్, నారాయణపూర్

నివేదికలు పంపాం



గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉంటే వాటి కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ట్రాక్టర్ల నిర్వహణ కొన్ని జీపీలకు భారమవుతోంది. అలాంటి వాటిని గుర్తించాం. నిధులు తొందరలోనే విడుదల అవుతాయని భావిస్తున్నాం. ఎస్ఎఫ్‌సీ నిధులు రావాల్సి ఉంది. అవి వస్తే కొంత వరకు సర్దుబాటు అవుతోంది. ప్రధానంగా ట్రాక్టర్ల నిర్వహణ భారం పంచాయతీలపైనే ఉంది.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

మహిళల రక్షణపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ ప్రేమ్‌దీప్

సిరిసిల్లక్రైం: మహిళలు, అమ్మాయిల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అందరికీ అవసరమని షీటీం ఎస్ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. జిల్లా షీ టీమ్ పెద్దూర్ పరిధిలోని అపెరల్ పార్క్‌లో పనిచేస్తున్న మహిళలకు మహిళల రక్షణ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పని చేసే ప్రదేశాల్లో ఎవరైనా వేధింపులకు పాల్పడితే షీ టీంకు 87126 56425 లేదా 100కు డయల్ చేసి నిర్భయంగా సమాచారం ఇవ్వాలన్నారు. వేధింపులకు పాల్పడిన వారికి తక్షణమే వారిని పట్టుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో ఏదైనా సమస్యకు గురైతే మౌనం వహించకుండా షీ టీమ్‌ను సంప్రదించి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. మహిళ లు, పిల్లలపై జరుగుతున్న నేరాలు వాటి శిక్షలు బాలల సంరక్షణ వారి హక్కులు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలోని మహిళలు, విద్యార్థినులు షీటీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ ఉమెన్ ఏఎస్ఐ ప్రమీల, ఉమారాణి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మూత్రశాలలు నిర్మించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోయినపల్లి: స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు నిర్మించాలని నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బస్టాండ్‌లో మూత్రశాలలు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనేక మంది మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ మండల కేంద్రంలో మూత్రశాలలు లేకపోవడం శోచనీయం అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అలువాల అజయ్, నాయకులు మాంకాళి తిరుపతి, పెగ్గెర్ల మహేందర్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ దినోత్సవం


కేక్ కట్‌చేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

చందుర్తి: మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాస్‌రావు, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


బోయినపల్లి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని రత్నంపేట, జగ్గారావుపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఎంపీపీ వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్, బావుసాయిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ బండ నర్సయ్య, సర్పంచులు కేతిరెడ్డి అరుణ, గంగాధర్ ప్రారంభించారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి ప్రారంభించారు.

చందుర్తి: మండలంలోని రామన్నపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ ప్రారంభించారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంతోపాటు మండెపల్లి, రాళ్లపేట, ఓబులాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ పడిగెల మానస, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్ ప్రారంభించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి, రాచర్ల బొప్పాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ప్రారంభించారు.

వీర్నపల్లి: మండలం శాంతినగర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల ప్రారంభించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తుర్కపల్లిలో సర్పంచ్ కాశోల్ల పద్మ, రామలక్ష్మణపల్లెలో జెడ్పీటీసీ నర్సయ్య, మద్దికుంటలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాజేశంగౌడ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

అటెన్షన్ ప్లీజ్



హైవే పక్కనే మురికికూపం

సిరిసిల్లటౌన్: మీరు చూస్తున్న ఈ ఫొటో సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలో ఉన్న మురికికూపం. మూడేళ్లుగా ఇక్కడ మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరు రోడ్డుపైకి చేరి ఇలా తయారైంది. పేరుకుపోయిన మురుగు సమస్య అందరికీ ఇబ్బంది కలిగిస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు కూడా విస్తరిస్తున్నాయి. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మీరు ప్రశ్నించాల్సిన అధికారి: సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్
ఫోన్ నంబరు: 98499 08822

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్


గోవర్ధన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో గీత కార్మికుల సంక్షేమానికి నూతన కమిటీలు కృషి చేయాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సంఘం మండల కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరైన మాట్లాడారు. వృత్తిపరంగా ప్రమాదంలో గాయపడిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గౌడ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి సర్కారు చేయూతనివ్వాలని కోరారు. అనంతరం గోవర్ధన్‌గౌడ్‌ను సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్, సభ్యులు దత్తాద్రిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజాగౌడ్, నారాయణగౌడ్, సుధాకర్‌గౌడ్, తిరుపతిగౌడ్, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితిలో ఉన్న మహిళకు రక్తదానం

- మానవత్వం చాటుకున్న ఇల్లంతకుంట ఎస్సై రాజేశ్


రక్తదానం చేస్తున్న ఎస్సై రాజేశ్

ముస్తాబాద్: అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ మహిళకు అత్యవసరంగా రక్తదానం చేసి, మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ముస్తాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రావుపల్లెకు చెందిన మహిళకు ఆదివారం అర్ధరాత్రి ఆపరేషన్ చేశారు. ఆమెకు బీ పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో.. భర్త శ్రీనివాస్ ఎటు వెళ్లాలో తెలియక రోడ్డుపైకి వచ్చాడు. ఒంటిగంట సమయంలో ఎవరూ అందుబాటులో లేక తీవ్ర ఆందోళనతో ఉన్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఇల్లంతకుంట ఎస్సై రాజేశ్ ముస్తాబాద్ తెలంగాణ చౌక్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఆందోళనతో కనిపిస్తున్న శ్రీనివాస్ వద్దకు వెళ్లి, ఏం జరిగిందని అడిగారు. అతను తన భార్య ప్రాణాపాయ స్థితిలో ఉందని, బీ పాజిటివ్ రక్తం అత్యవసరమని తెలిపాడు. స్పందించిన ఎస్సై తనది బీ పాజిటివ్ రక్తమేనని చెప్పి, ఆసుపత్రికి వెళ్లి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను డాక్టర్ చింతోజు శంకర్, ముస్తాబాద్ ఎస్సై వెంకటేశ్వర్లు అభినందించారు. బాధిత కుటుంబసభ్యులు ఎస్సై రాజేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కొన్ని ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ టౌన్-1, టౌన్-2 ఏఈలు మధుకర్, విష్ణుతేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయినగర్, కొత్తబస్టాండు, బీవైనగర్, గోపాల్‌నగర్, గణేశ్‌నగర్, ఇందిరానగర్, ఆదర్శనగర్, వెంకట్రావునగర్, నెహ్రూనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కంటివెలుగు ప్రారంభం


కంటివెలుగు కార్యక్రమంలో జిందం కళ

సిరిసిల్లటౌన్: 14వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ అడ్డగట్ల మాధవి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగు సత్తెమ్మ, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, ఎంపీటీసీ వనపర్తి దేవరాజు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని మొర్రాయిపల్లెలో కంటి వెలుగు శిబిరాన్ని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచ్ సడిమెల సుజాత, ఉపసర్పంచ్ మెంగని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సడిమెల ఎల్లం, లక్ష్మణ్, ఎంపీడీవో రమాదేవి, సీహెచ్‌వో యాదగిరి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి


సీపీఆర్ చేస్తున్న ఎంపీపీ పడిగెల మానస

తంగళ్లపల్లి: సీపీఆర్‌పై అందరికీ అవగాహన ఉండాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్నేహ ఆధ్వర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసససియేషన్) శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కాలంలో చిన్న వయస్సులో ఉన్న వారు కార్డియాక్ అరెస్ట్ మూలంగా ప్రాణాలు కోల్పోతున్నారని, సీపీఆర్‌పై అవగాహన పెంచుకుని ఆపదలో ఉన్నవారిని రక్షించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుమాధవ్ ప్రజాప్రతినిధులకు సీపీఆర్ గురించి శిక్షణ ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.లచ్చాలు, ఏఎస్ఎం జ్యోతి, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరానికి రూ.25 వేల పరిహారమివ్వాలి


రైతులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం అందివ్వాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని బావుసాయిపేట, గోవిందరావుపేట తండాల్లో వడగండ్ల వానతో నష్టపోయిన వరిపంటలు, ఆస్తి నష్టాలను పరిశీలించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. మామిడి, కోళ్ల ఫారాలకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు. గతంలో ఈ ప్రాంతంలో వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. గోవిందరావుపేట, వట్టిమల్ల గ్రామాల్లో కరెంట్ పోళ్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, చేపూరి గంగాధర్, బైరగోని నందు, నాగండ్ల భూమేశ్, గుగులోత్ ప్రకాశ్, పెంతల శ్రీనివాస్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచుల డిమాండ్
- నష్టపోయిన పంట పరిహారం చెల్లించాలి
- మండల సభ గరం.. గరం


మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

చందుర్తి: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు గళమెత్తారు. సమావేశం ప్రారంభంలోనే సర్పంచులు ఈ సమస్యను ఉటంకిస్తూ, ఏళ్ల తరబడి బిల్లులు రాక చేసిన అప్పులు మిత్తి రూపంలో పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

➡ సిరిసిల్ల నియోజకవర్గంలో పంచాయతీ బిల్లులు చెల్లించారని, మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి ఓ న్యాయం, తమకో న్యాయమా అంటూ మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి ప్రశ్నించారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో బిల్లులు వచ్చేలా చూస్తామని ఎంపీపీ లావణ్య బదులిచ్చారు.

➡ వడగళ్ల వానకు, ఈదురుగాలులకు పంట పొలాలన్నీ దెబ్బతిన్నాయని, వాటికి పరిహారం చెల్లించాలని సభ్యులు డిమాండ్ చేశారు. పంట పొలాలను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదికను అందజేశామని, వారి ఆదేశాల మేరకు సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చేస్తామని ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి ప్రణిత బదులిచ్చారు.

➡ మిషన్ భగీరథ పథకంలో కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

➡ గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైందని, సమస్యకు పరిష్కారం చూపాలని మూడపల్లి గ్రామ సర్పంచ్ చిలుక అంజిబాబు కోరారు.

➡ విద్యుత్ వైర్లు లూజుగా ఉన్న పంట పొలాల వద్ద స్తంభాలు వేయాలని మల్యాల సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ ఆరోపించారు.

➡ కంటి వెలుగు నిర్వహణను పంచాయతీలకు ఇచ్చే నిధులకు రెండింతలు ఎక్కువగా ఖర్చవుతోందని సభ్యులు వాపోయారు.

➡ ఎక్సైజ్ శాఖ, ఆర్అండ్‌బీ, ఆర్‌టీసీ, మత్స్య శాఖ, నీటిపారుదల, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాస్‌రావు, వైద్యాధికారి సంపత్, పశువైద్యాధికారి నితీశ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఎం రాజయ్య, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అదుర్స్.. చిల్డ్రన్స్


నృత్యం చేస్తున్న చిన్నారులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్ల గాంధీనగర్ ప్రాంతంలోని చైతన్యభారతి స్కూల్(సూర్య విద్యా సంస్థ) ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అందమైన సెట్టింగ్స్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు గుండ్లపెల్లి నీరజ, గడ్డం చందన, చొప్పదండి చంద్రకళ, రూరల్ సీఐ ఉపేందర్, పాఠశాల చైర్మన్ ఆడెపు రవీందర్, ప్రిన్సిపాల్ కళ్యాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం

కోనరావుపేట: మండలం కనగర్తిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవంలో చిన్నారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

అదుపుతప్పిన కారు

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం మూలమలుపు వద్ద సోమవారం కారు బోల్తాపడగా అందులో ఉన్న నిండు గర్భిణి ప్రమాదం నుంచి బయటపడింది. మండలంలోని లింగంపల్లికి చెందిన గంగాధర సోన అనే గర్భిణీ కుటుంబసభ్యులతో కలిసి ఆస్పత్రికి వెళ్తున్నారు. మల్లారం మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. అదే సమయంలో అటువైపు వెళ్తున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ వెంటనే బాధితులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

దుండగులను శిక్షించాలి

ఎల్లారెడ్డిపేట: ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రజక సంఘం ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బాలనాగాచారి రూ.60 వేలు, వల్లెపు వెంకటి రూ.60 వేలు, కీర్తి లచ్చయ్య రూ.19 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్ అందజేశారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఎప్పుడిస్తారు?

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా కూడా ఇప్పటి వరకు లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య అన్నారు. పెద్దలింగాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి మాట్లాడారు.

ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట: గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మండలం వెంకటాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ వైద్య చికిత్సల నిమిత్తం జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

సన్మానం

బోయినపల్లి: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వరదవెల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులను సోమవారం బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి సన్మానించారు.

సిరిసిల్లటౌన్: నూతనంగా ఎన్నికైన చేనేత వస్త్ర వ్యాపార సంఘం కార్యవర్గానికి తెలంగాణ పవర్‌లూం టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ సన్మానించారు.

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కోడి లక్ష్మణ్‌ను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు.